


# దేశానికి జ్వరమొచ్చింది

## మాధవ్

''అమ్మా, అమ్మా'' అని ఐదేళ్ళ పసికూన మూలుగుతున్నాడు.

''నిద్రపో బాబు'' అని ప్రక్కనున్నవాళ్ళు చెబుతున్నారు.

''డాక్టర్ ఇది పాయిజనింగు కేసు'' అని సిస్టరు మేరీ కొత్తగా చేరిన డాక్టరు భరత్‌కు చెప్పుకుపోతున్నది. డాక్టర్ భరత్ ఆ రోజే కొత్తగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది! రాత్రి డ్యూటీ. రోగుల గురించి చెప్తూ డాక్టరును రౌండ్స్‌లో తీసుకొని వెళ్తున్నది మేరీ.

''తల్లి ఇకరాదని ఈ పిల్లాడికి తెలీదు సార్'' మేరీ ఇంగ్లీషులో డాక్టరుకు చెప్పింది.

''దరిద్రం భరించలేక ముగ్గురు పిల్లలకి కాఫీలో విషమిచ్చి, తాను తాగింది. వాంతి చేసికొన్న ఈ పిల్లాడు మాత్రం బతికాడు. తల్లీ, మిగిలిన ఇద్దరు పిల్లలు చనిపోయారు. ఉన్న దరిద్రానికి తోడు ఆవిడ భర్త ఒక రిక్షావాడు- రోజూ తాగి వచ్చి పెళ్ళాన్ని కొట్టేవాడుట''

''సార్ ఇది గాయాల కేసు. బ్రిడ్జి మీద నుంచి కాలవలో దూకితే తగిలిన దెబ్బలని పోలీసువారు చేర్చారు!''

వరండాలో పోలీసు వాణ్ణి చూడ గానే డాక్టరుకు తాను పేపరులో చదివిన వార్త గుర్తుకొచ్చింది. దొంగను పట్టుకొని పోలీసు స్టేషనుకు తీసికొని వెళ్తుండగా, పోలీసుల నుంచి తప్పించుకోవటానికి దొంగ కాలవలో దూకాడని, అందువల్ల గాయాలు తగిలినవని పోలీసు పత్రికా ప్రకటనలో వున్నట్లు గుర్తు వచ్చింది.


''డాక్టర్, నర్సు చెప్పేది నిజంగాదు'' అరిచాడు పేషెంటు.

''ఉద్రేకపడవద్దు'' అని డాక్టరు సలహా యిచ్చాడు.

''పోలీసోళ్ళు ఎముకలు విరగ్గొట్టి, ఇహ నేనుచస్తే వాళ్ళకు చావు వస్తుందని ఇక్కడకు తెచ్చారు సార్'' రోగి బాధతో చెప్పాడు.

తను పనిచేసే షావుకారింట్లో అమ్మగారు తనని చనువుగా చూస్తుందని షావుకారి గారికి అనుమానం ఏర్పడ్డదట. అందుకని ఇంట్లో ఉంగరం పోయిందనీ, అది పనివాడే కాజేసి ఉంటాడని షావుకారు తన ఫ్రెండ్ అయిన ఎస్.ఐ.కి చెప్పి, తనని అరెస్టు చేయించాడట.

''ఎంత కొట్టినా, చేయని దొంగతనాన్ని చేశానని ఎలా ఒప్పుకోమంటారు, మీరే చెప్పండి ...ఇప్పుడు పోలీసోళ్ళు నాకాళ్ళు, చేతులు తీసేశారు సార్. ఇంక




ఎలా బతకాలో తెలీటం లేదు సార్'' అని రోగి కళ్ళనీళ్ళు పెట్టాడు.

డాక్టర్ భరత్‌ను ఇంకో బెడ్డు దగ్గరికి తీసికొని వెళ్ళింది మేరీ. ''డాక్టర్, ఇది మల్టిపుల్ ఫ్రాక్చర్ కేసు. బస్సు డ్రైవర్ సార్. తన బస్సును, ఇంకో బస్‌కన్నా ముందు తీసికొని వెళ్దామని ఎదురుగా వచ్చే లారీతో డీ కొట్టించాడు!''

''ఏం చెయ్యమంటావ్ సిస్టర్'' అని డ్రైవరు డాక్టరు వైపు చూశాడు.

''మీరైనా చెప్పండి. నా బస్సు ఆదాయం తగ్గితే మా బస్సు ఓనరు నా ఉద్యోగం తీసేస్తాడా లేదా! ముందు వెళ్తేగాని పాసింజర్లు మా బస్సులో ఎక్కరే!''

భరత్ పక్క బెడ్ దగ్గరికి వెళ్ళాడు. ''డాక్టర్ మా ఆయనకి చూపు తిరిగి వస్తుందా'' అని ఆందోళనతో పేషంటు భార్య అడిగింది.

''డాక్టర్, ఇది కల్తీ సారాయి కేసు. ముగ్గురు చచ్చిపోయారు. ఇతనికి చూపు పోయింది'' సిస్టరు డాక్టరుకు కేసు పూర్వాపరాలు చెప్పకుపోయింది. ''ప్రభుత్వ సారాలో నిషా లేదని, వేరేచోట తాగారుట. అది కల్తీసారా అని చూపుపోయి, ప్రాణాలు పోతేగాని తెలీలేదట!''

భరత్ పక్కనే ఉన్న మరో బెడ్ దగ్గరకు పోయాడు. పేషంటు ముఖం కన్పడకుండా దుప్పటి కప్పకొని వున్నాడు. పక్కనే ఇద్దరు కానిస్టేబిల్స్ వున్నారు.

''డాక్టర్ ఇది హార్ట్ కేస్. పేషెంటు ఒక నక్సలైటుట''

నిద్రపోయేవాణ్ని లేపటమెందుకని డాక్టరు తన డ్యూటీ రూములోకి వెళ్ళి కూర్చున్నాడు.

పక్క వార్డునుంచి మరో సిస్టరు వచ్చింది. ''విశేషాలేంటి సిస్టర్'' అని డాక్టరడిగాడు.

''కట్నం కేసు అమ్మాయి చచ్చిపోయింది సార్''

ప్రశ్నార్థకంగా చూశాడు డాక్టర్.

''పది వేలిచ్చి పెళ్ళి చేశారుట. ఇంకా ఐదువేలు ఇవ్వమని భర్త రాచి రంపాన పెడ్తున్నాడుట. బాధ భరించలేక కిర్సనాయిలు పోసికొని నిప్పు పెట్టుకున్నదట. భర్తే అగ్గిపుల్ల గీశాడని చెప్పవమ్మా అని తల్లిదండ్రులు




బ్రతిమలాడినా, ఆ పిల్ల ఒప్పుకోలేదు సార్. స్టవ్ ప్రమాదంలో వళ్ళు కాలిందనే డైయింగ్ డిక్లరేషన్‌లో చెప్పింది!'

"రెండు డెలివరీ కేసులు బయటికి వెళ్తున్నాయి సార్" చెప్పుకుంటూ పోయింది. "పెద్ద ఆపరేషను చేస్తేగాని ప్రసవం సరిగ్గా జర గదని, పెద్ద ఆపరేషను అంటే-సిజేరియన్. తన భర్త నర్సింగ్‌హోమ్‌లో చేయించుకుంటే క్షేమమని లేడీ డాక్టర్ వారికి చెప్పారుట. అందుకని వాళ్ళు రేపు డిశ్చార్జి అవుతున్నారు!'

భరత్‌కు కొంచెం ఆశ్చర్యం వేసింది. ఇంటికి వచ్చిన పేషెంటు దగ్గర డబ్బు తీసికొని, ఫ్రాక్చరుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషను చేశాడుట బోన్ స్పెషలిస్టు. డెలివరీకి ఆస్పత్రిలో చేరిన స్త్రీలను ఇంటికి రమ్మంటున్నది గైనకాలజిస్టు.

వారం గడవలేదు, భరత్‌కు రోజురోజుకు కొత్త సంగతులు తెలుస్తున్నాయి.

పోస్టుమార్టమ్‌కు (శవ పరీక్షకు) వచ్చిన శవాలను వెంటనే పరీక్ష చేయరుట. హత్య కేసులో మరణం సహజంగా జరిగినట్లు సర్టిఫికెట్ ఇవ్వమని ప్రెజరు వుంటుందట. డబ్బు ఇస్తేగాని శవాన్ని తోటీవాడు బయటకు ఇవ్వడట. హాస్పిటలు మందులు బయట అమ్ముకుంటారుట. ప్రభుత్వ ఆస్పత్రిలో అనుభవం గడించి గల్ఫ్ దేశాలకు ఉద్యోగాలకు వెళ్ళారుట కొందరు డాక్టర్లు. కొందరైతే శలవు పెట్టి ఇళ్ళ దగ్గర నర్సింగ్ హోమ్‌లు నడుపుతున్నారట.

ఆలోచిస్తే తల తిరిగిపోతున్నది. ఇన్నాళ్ళా చదువు చదవని బయట ప్రపంచాన్ని గురించి తెలిసికోలేదు. సంపన్నకుటుంబంలో నుంచి రావటం వలన అవసరం కూడా కల్గలే. డాక్టరయి, ఏదైనా చేతనయినంత వరకు బీద బిక్కి ప్రజలకు సేవ చేద్దామనే ఆదర్శంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. సేవ జేసే అవకాశం అసలు వుంటుందా?

మళ్ళీ ఆ రాత్రి రౌండ్సు మొదలు పెట్టాడు భరత్. ఈ సారి నేరుగా నక్సలైటు ఖైదీ రోగి దగ్గరికి వెళ్లాడు. వారం రోజులుగా చూస్తున్నా, ఎప్పుడూ ముసుగు వేసుకు నే వుంటున్నాడు. ఈ రాత్రి అన్నా చూడాలనిపించింది. తనను అంతదూరంలో చూడగానే, ఖైదీ రోగి ముసుగేసుకోవడం కన్పించింది.

కానిస్టేబిల్సు వున్నందువల్ల తనతో మాట్లాడటం ఇష్టం లేదేమో!కానిస్టేబిల్సును బయటకు వెళ్ళమని ఖైదీ మీది ముసుగు తీశాడు భరత్.

మాసిన గడ్డం. చూపులో ఏదో తీక్షణత. ఇంతలో చిరునవ్వు.

"ఒంట్లో ఎలావుంది" డాక్టరు ప్రశ్న.

"దేశం ఎలా వుంది?" సమాధానంగా ఖైదీ ప్రశ్న.

డాక్టరు భరత్‌కు ఆశ్చర్యం వేసింది.

"ఇంకా గుర్తుపట్టలేదా? నేనురా క్రిష్ణని"

"క్రిష్ణ" అనంగానే చిన్ననాటి క్రిష్ణమూర్తి గుర్తు వచ్చాడు. ఇంటరుమీడియట్‌దాకా ఇద్దరూ ఒకే కాలేజిలో చదివారు. తాను **M.B.B.S** లో చేరితే వాడు **B.A.** తర్వాత **M.A** లో చేరాడు. ఇంటరులో వుండంగానే వాడికి రాజకీయాల పిచ్చి వుండేది, తనకు చదువు పిచ్చి వున్నట్లు. వాడు మొదట్లో కాంగ్రెసు, తర్వాత కమ్యూనిస్టు, ఆ తర్వాత మార్క్సిస్టు పార్టీలలో తిరుగుతుండేవాడు. ఇలా ఇక్కడ ప్రత్యక్షమవుతాడని కలలో కూడా ఊహించలే.

భరత్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇద్దరు పోలీసుల కాపలాలో- ఒక బోనులో వున్న మృగం లాగ- క్రిష్ణ కన్పించాడు.

"దేశం ఎలా వుందిరా?" అని మళ్ళీ క్రిష్ణ ఆప్యాయంగా అడిగాడు.

భరత్‌కు మాట పెగల్లే. ఏమని చెప్పేటట్టు? వారం రోజులుగా దేశం ఎల్లా వుందన్నది ఆస్పత్రిలో చూశాడు, విన్నాడు.

"ఒక్క మాటలో చెప్పాలంటే ధనదాహమనే జ్వరం ఆవహించింది" అన్నాడు డాక్టరు.

"ఎందుకో తెలుసా?" క్రిష్ణ అడిగి తనే చెప్పుకు పోయాడు.

"ఈ సమాజంలో డబ్బుకే విలువుంది. ఈ రోజు ఎట్టా గడుస్తుందా అని కోట్ల మంది అలమటిస్తుంటే, వచ్చే శతాబ్దానికి డబ్బు చాలదేమోనన్న భయంతో కొన్ని లక్షలమంది ఆందోళనపడ్తూ ఆర్జిస్తున్నారు. ప్రతివాడికి తిండి, గుడ్డ, నీడ, ఆరోగ్యం, చదువు, ఉద్యోగం ఏర్పరచాలంటే ఈ దోపిడీ వ్యవస్థ మారక తప్పదు. మారాలంటే కొందరు త్యాగం చెయ్యక తప్పదు. అందుకేరా **M.A.** చదివి కూడా నక్సలైటునని పించుకుంటున్నది.

"ఇంక నువ్వు వెళ్ళు. పోలీసోళ్ళు గాభరా పడ్తారు. నీకు తెలీకుండా వుండాలనే నేను రోజూ ముసుగు కప్పుకుంటున్నది-"

భరత్ తన డ్యూటీ రూముకు తిరిగి వచ్చాడు. క్రిష్ణ చెప్పింది అక్షరాలా నిజం. ఆపరేషను చేస్తేగాని సమాజానికి పట్టిన కుళ్ళును తీసివేయటానికి వీల్లేదు. ఆ ఆపరేషను చేసే నేర్పు అందరి దగ్గరా లేదు. ఆ కోరిక, ఓర్పు, ధైర్యం వున్నవారికి ఎందుకు సహాయపడ కూడదు?

మళ్ళీ క్రిష్ణ దగ్గరికి వెళ్ళాడు. ఇ.సి.జి. **(E.C.G.)** తీయాలని ట్రాలీ తెప్పించాడు. కాని స్టేబిల్సు వార్డులోనే వున్నారు. ట్రాలీ ఎక్కించి, **E.C.G.** రూమ్‌కు తీసికొని వెళ్ళాడు.

"క్రిష్ణా, నువ్వు పారిపోతానంటే నేను బాత్ రూమ్‌కు వెళ్తా", అన్నాడు భరత్.

క్రిష్ణ కళ్ళల్లో కృతజ్ఞతాభావం తొణికిసలాడింది. భరత్ బాత్‌రూముకు వెళ్ళాడు. పక్కనే వున్న డాక్టరు కోటు, స్టెతస్కోపు తీసికొని క్రిష్ణ చీకటిలో కల్సి పోయాడు.

"నక్సలైటు పరారు, డాక్టరు సస్పెన్షన్" మరుసటి రోజు పేపర్లో ఒక శీర్షిక.

ప్రభుత్వ ఆస్పత్రిలో చేద్దామనుకొన్న సేవ ఇంటి దగ్గరే చేయడం మొదలుపెట్టాడు భరత్.

## 'జనవరి 1' కథ

ఈజిప్టియన్లవే క్రీస్తు పూర్వం 4200 సంవత్సరాలనాడు ప్రారంభించబడిన క్యాలెండరు నిర్మాణం క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి ఒక నిర్దిష్టమైన రూపం ధరించింది. రోమన్ చక్రవర్తి 8వ గ్రెగరీ చొరవ ఫలితంగా క్రీస్తుశకం 1582వ సంవత్సరంలో- 365 రోజులతో కూడిన ఒక నూతన క్యాలెండరును తయారుచేశారు. ఈ క్యాలెండరు ప్రకారం ప్రతి నాలుగు సంవత్సరాలకొకసారి 'లీప్ సంవత్సరం' (ఫిబ్రవరి నెలకు 29 రోజులుంటాయి.) వస్తుందనీ, ప్రతి శతాబ్దం చివరి సంవత్సరాన్ని మాత్రం లీప్ సంవత్సరంగా పరిగణించకూడదనీ స్పష్టం చేయడం జరిగింది.

అయితే, ఈ గ్రెగేరియన్ క్యాలెండరు ప్రకారం, నూతన సంవత్సరాన్ని ఏ తేదీ (నెల) నుంచి ప్రారంభించాలి అనే ఒక సమస్య ఉత్పన్నమైంది. అంతకు ముందు వరకు ఎవరి ఇష్ట ప్రకారం వాళ్ళు నూతన సంవత్సరాన్ని ప్రారంభించుకొనే వాళ్ళు. ఉదాహరణకు, అస్సీరియన్లు- సెప్టెంబరు లేదా అక్టోబరు నెలల్లో తమ నూతన సంవత్సరాన్ని ప్రారంభించే వారు. పర్షియన్లు, ఈజిప్టియన్లు సెప్టెంబర్ 21వ తేదీ (పగలు, రాత్రి సమానంగా వుండే రోజు) నుంచి నూతన సంవత్సరాన్ని ఆరంభించే వాళ్ళు. అలాగే, గ్రీకులు- సంవత్సరం మొత్తం మీద అతి చిన్న రోజైన డిశంబరు 2వ తేదీని తమ సంవత్సరాదిగా ఆచరించేవారు.

ఇంగ్లండులో మాత్రం క్రీస్తు జన్మదినంగా పరిగణించబడుతున్న డిశంబరు 25వ తేదీ నుంచి తమ నూతన సంవత్సరాన్ని ప్రారంభించే వారు. ఆ తరువాత మార్చి 25వ తేదీ (కన్య మేరీకి తాను గర్భం దాల్చబోతున్నట్లు గాబ్రియేలు దూత తెలిపిన రోజు)కి మార్చుకున్నారు.

ఈ విధంగా ఒక్కొక్క ప్రాంతంలోని వారిచే ఒక్కొక్క విధంగా ఆచరించబడుతున్న నూతన సంవత్సర ఆరంభ తేదీల వల్ల, వ్యవహారిక విషయాలలో అనేక ఆటంకాలు తలెత్తసాగాయి. అందుకే, ఈ విషయమై అందరికీ ఆమోదయోగ్యమైన ఒక తేదీని నిర్ణయించడానికిగాను క్రీస్తుశకం 1752వ సంవత్సరంలో ఇంగ్లండులో బ్రిటిష్ ప్రభుత్వాధికారులు, చర్చి మతాధికారులు సమావేశమై చర్చలు జరిపి చివరకు 'జనవరి ఒకటవ' తేదీ నుంచి నూతన సంవత్సరం ప్రారంభించాలి అని నిర్ణయించి ప్రకటించారు. అప్పటి నుంచి గ్రెగేరియన్ క్యాలండరును అనుసరిస్తున్న అన్ని దేశాలూ 'జనవరి ఒకటవ తేదీ'నే సంవత్సరాదిగా వ్యవహరిస్తూ, నూతన సంవత్సర వేడుకలు జరుపుకొంటున్నారు.

-వి.ఆర్. ప్రసాద్